సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పూడూర్, గౌడవెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్లకొమ్మల నరికివేత కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు పవన్‌చందు, శశిధర్‌రెడ్డి తెలిపారు. పూడూర్ పరిధిలోని అన్ని పరిశ్రమలకు, గౌడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గౌడవెల్లి, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాలలో అగ్రికల్చర్ సర్వీసులకు, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

మేడ్చల్: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగ యువతకు వివిధ కోర్సులలో ఉచితంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కలిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు ఐటీఐ లో సంప్రదించాలని కోరారు.

టెక్నోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్ రూరల్:గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న టెక్నికల్ ఈవెంట్ టెక్నోత్సవ్ పోస్టర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ నెల 28,29 తేదీలలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఇంజనీరింగ్ విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

కీసర: కీసర శ్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం తన తండ్రి చిత్తర్ల మల్లేష్‌గౌడ్ జ్ఞాపకార్థం రూ.5 లక్షల విలువచేసే ఇసుక, కంకర, తదితర వస్తుసామగ్రిని విరాళంగా అందజేయనున్నట్లు కీసర పంచాయతీ కోఆప్షన్‌సభ్యుడు చిత్తార్ల రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన కీసరలో విలేకరులతో మాట్లాడారు. తాను ఇచ్చిన సామగ్రితో సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో శ్మశానవాటిక చుట్టూ బేస్‌మెంట్ నిర్మాణం చేపడతామన్నారు.

'టెన్త్'లో ప్రథమస్థానంలో నిలపాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో మేడ్చల్‌ను ప్రథమ స్థానంలో ఉంచేలా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై ప్రధానోపాధ్యాయులు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో గురువారం రెండు రోజుల పాటు జరిగే సమీక్ష సమావేశాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విజయకుమారి ..ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన ప్రధానోపాధ్యాయులను అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 30 రోజులు ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం 7వ వార్డులో కౌన్సిలర్ గూడు సబితా ఆంజనేయులు గౌడ్‌తో కలిసి ఆయన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధుజా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట మోసం..

- మాయమాటలు చెప్పి మైనర్ బాలికను తీసుకెళ్లిన యువకుడు
- అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

మేడ్చల్ రూరల్: ప్రేమించానంటూ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తనతో పాటు తీసుకువెళ్లిన యువకుడిని మేడ్చల్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ పోలీసులు తెలిపిన మేరకు.. రాజబొల్లారం గ్రామంలోని తునాఫుడ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సద్దామ్ హుస్సేన్(22) అదే పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేసే 16 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమిస్తున్నట్లు చెప్పాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో వారు సద్దామ్‌ను పలు మార్లు హెచ్చరించారు. అయినా అతనిలో మార్పు రాలేదు. ఇదిలా ఉండగా ఈ నెల 6న పరిశ్రమకు వచ్చిన బాలికను తీసుకొని తన సొంత రాష్ట్రమైన అస్సాంకు పరారయ్యాడు. దీంతో బాలిక తండ్రి 7వ తేదీన మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సద్దాం ఫోన్‌ను జీపీఆర్‌ఎస్‌తో ట్రాక్ చేస్తుండగా అతను గుంటూరు వైపు వెళ్తున్న రైలులో ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో గుంటూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సద్దామ్ హుస్సేన్‌ను, మైనర్ బాలికను అక్కడే అదుపులోకి తీసుకున్నారు. వారిని మేడ్చల్ పీఎస్‌కు తీసుకువచ్చేందుకు సీఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందిని పంపారు. పూర్తి విచారణ జరిపి అతనిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ధనం చెల్లించినా.. దరి చేరలే!



గొర్రెలు రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన



సాక్షి,మేడ్చల్ జిల్లా: గొల్ల, కురుమల్లో ఎక్కువ మందికి గొర్రెల పెంపకమే జీవనోపాధి. అయినప్పటికీ మాంసం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి ఎగుమతుల స్థాయికి చేరాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇదే ఉద్దేశంతో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా గొర్రెల పెంపకందారులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు వీలవుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ నిధుల లేమీతో 'మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి' అన్న చందంగా మారింది. పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక గొల్ల, కురుమలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 2017న గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 15 శాతం రాయితీపై రెండు విడతలుగా వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఎంపీడీఓ, తహసీల్దార్, పశు వైద్యాధికారి బృందం సభ్యులను డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. మొదటి, రెండో విడతల్లో కలిపి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 2,946 యూనిట్లు మంజూరు కాగా, మొదటి విడతలో 1,342 యూనిట్లకు చెందిన లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయగా.. రెండో విడతలో 229 యూనిట్లకు చెందిన లబ్ధిదారులు ఎంపిక చేశారు. కాగా లబ్ధిదారులంతా నాలుగేళ్లుగా యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారు.

ఎదురు చూపులు ఎన్నాళ్లో..

గొర్రెల పెంపకం, వ్యవసాయమే జీవనాధారంగా పల్లెల్లోని ఆయా గ్రామాల గొల్ల, కురుమలు ప్రభుత్వ రాయితీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. లాటరీ ద్వారా ఎంపిక చేసి మొదటి విడతలో పంపిణీ చేయడంతో రెట్టింపు ఉత్సాహంతో రెండో విడత కోసం పశుసంవర్ధక శాఖకు డీడీలు చెల్లించారు. ఆర్థికంగా బాగుపడతామనే ఉద్దేశంతో అప్పులు చేసి లబ్ధిదారుడి వాటా కింద ఒక యూనిట్ గొర్రెలకు రూ.31,250 డీడీల రూపంలో చెల్లించారు. ప్రభుత్వ రాయితీ రూ.93,750 ఉంది. మొత్తంగా రూ.1.25 లక్షలతో ఒక యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందించాల్సి ఉంది. అందులో రూ.1.10 లక్షలు గొర్రెల కొనుగోలు కోసం ఖర్చు చేయాల్సి ఉండగా మిగతా డబ్బు దాణా పంపిణీ చేయడానికి కేటాయించారు. కొత్తగా ఒక్కో యూనిట్ ధర రూ.1.75 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో రాయితీ మినహాయిస్తే లబ్ధిదారుడు ఎంత చెల్లించాలనేది ప్రకటించాల్సి ఉంది. రెండో విడతలో 1604 యూనిట్లకు గానూ ఇప్పటి వరకు 1375 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. మిగతా 229 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది.

అప్పులు తెచ్చి.. డీడీలు కట్టి..

ఈ గొర్రెల యూనిట్లు వెంటనే పంపిణీ చేస్తారని భావించి తాము ఇతరుల వద్ద అప్పులు తెచ్చి డీడీ కట్టామని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. నాలుగేళ్లుగా గొర్రెలు రాక.. తీసుకున్న డబ్బులకు అప్పులు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెల యూనిట్లు ఎప్పుడిస్తారంటూ జిల్లా కేంద్రంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంతో పాటు మండలాల్లోని పశు వైద్యశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెండో విడత కోసం నాలుగేళ్ల ఎదురు చూపులకు మోక్షం కలిగించేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్స్ ఫీజులు వసూళ్లపైపై ప్రత్యేక దృష్టి సారించాలన నాగారం మున్సిపల్ చైర్మెన్ మున్సిపల్ బిల్ కలెక్టర్లకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆర్థికసంవత్సరం ముగింపు లోపు నూటికి నూరు శాతంపన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

అభివృద్ధే లక్ష్యం : డిప్యూటీ మేయర్



పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ సంతోష్‌నగర్‌లో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. నాయకులు మహేష్, అహ్మద్ సాధిక్, మల్లారెడ్డి, నర్సింహులు, చంద్రయ్య, భారతి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

పోచారం: సమాజంలో అందరూ ఆఖరికి అనాథలే అవుతారని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మల్లయ్య అన్నారు. గురువారం నారపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరిగిన వికాస్ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అన్ని వర్గాల పిల్లలకు మెరుగైన విద్యనందిస్తున్న స్కూల్ యాజమాన్యం అభినందనీయమన్నారు. అంతేగాక అనాథ పిల్లల భవితకు పునాదులు వేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు కొండల్ గౌడ్, పోచారం మున్సిపాలిటీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సీఐ మల్లయ్య

గౌడవెల్లిలో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళలను సన్మానిస్తున్న న్యాయమూర్తులు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంబరాలకు మేడ్చల్ న్యాయస్థానాల న్యాయమూర్తులు హాజరై మహిళలను సన్మానించారు. న్యాయమూర్తులు లావణ్య, పార్థసారధి, జెడ్పీటీసీ శైలజరెడ్డి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



చౌదరిగూడలో సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. చౌదరిగూడలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి, కార్యదర్శి గౌతమి, మంగ, మహిళ పారిశుద్ధ్య కార్మికులు, మహిళ వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు.

ఘట్‌కేసర్‌లో..

మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ తొమ్మిదో వార్డులోని తెలుగు, ఉర్దూ మీడియం స్కూల్ మహిళ ఉపాధ్యాయులను గురువారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మీనా, పద్మ, నజీస్, ఉపాధ్యాయులు హైమావతి, అఖిల, దేవి, అతుఫా పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు చెందిన మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీవోలు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయంలతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఏఆర్వో నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను క్షుణ్ణంగా చదవాలని ఆదేశించారు. ఏదైనా కారణాలతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నికలు నిర్వహించలేకపోతే అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా సంసిద్ధంగా ఉండాలని నర్సింహారెడ్డి సూచించారు.

క్రైం కార్నర్..

మహిళను వెంబడించిన యువకుడిపై కేసు

ఘట్‌కేసర్: విధులను ముగించుకొని రాత్రి సమయంలో ఒంటరిగా ఇంటికి వెళుతున్న మహిళను ఓ యువకుడు వెంటపడ్డాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజీగూడకు చెందిన ఓ మహిళ విధులు ముగించుకొని రాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలోని నవభవిత పాఠశాల సమీపంలోకి రాగానే ఓ యువకుడు ఆమెను వెంబడించాడు. దీంతో ఆమె భయాందోళనకు గురై సోదరుడు ప్రభుకుమార్‌కు ఫోన్ చేయగా సంఘటన స్థలానికి వచ్చాడు. ఆ యువకుడు ప్రభుకుమార్‌ను దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. బాధితులు పోలీస్ మొబైల్ వ్యాన్‌కు సమాచారం ఇవ్వడంతో తక్షణమే అక్కడికి చేరుకున్న పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు స్థానిక శ్రీ లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన విక్రమ్‌నాయక్ (19)గా తేలింది. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి మృతి



పులేందర్ మృతదేహం

శామీర్‌పేట్: రోడ్డు ప్రమాదంలో లాల్‌గడి మలకపేట పంచాయతీ వార్డు సభ్యుడు పులేందర్ మృతిచెందారు. ఈ ఘటన గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మండల పరిధిలోని లాల్‌గడి మలకపేటకు చెందిన పులేందర్ (50), మెడిసిటీ ఆసుపత్రిలో పనిచేస్తూ లాల్‌గడి మలకపేట పంచాయతీ వార్డుసభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం మెడిసిటీకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హనుమాన్ దేవాలయం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో పులేందర్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

ఘట్‌కేసర్: రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. కేంద్ర రోడ్డు నిధులతో నిర్మిస్తున్న నారపల్లి-ఎదులాబాద్ రోడ్డుపై మక్త వద్ద కల్వర్టు పనులు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కల్వర్టు పనులు 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమాదేవి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



మక్త వద్ద కల్వర్టు పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి తదితరులు

కీసరగుట్టస్వామి సేవలో జహీరాబాద్ ఎంపీ



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సేవ లో గురువారం జహీరాబాద్ ఎంపీ బీబీపటేల్ పాల్గొన్నారు. ఉదయం కీసరగుట్ట దేవాలయానికి వచ్చిన ఎంపీకి ఆలయ వేదపండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. శ్రీస్వామివారి అభిషేకం, పూజల అనంతరం ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేసారు.

నీటి సమస్యకు పరిష్కారం

మేడ్చల్: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు పాత వాల్వ్ తొలగించి నూతన వాల్వ్ ఏర్పాటు చేయడంతో పట్టణంలోని పలు కాలనీల్లో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. పట్టణంలోని కింది బస్తీ, వీకర్‌సెక్షన్, హౌజింగ్ బోర్డు కాలనీ, వినాయక్‌నగర్, బ్యాంకు కాలనీ,ఎయిర్ ఫోర్స్ కాలనీల్లో నీటీ సరఫరా అవుతోందని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి తెలిపారు. పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు.



పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

అవకాశాలను ఉపయోగించుకోవాలి

ఘట్‌కేసర్: అందుబాటులో ఉన్న అవకాశాలను యువ ఇంజినీర్లు ఉపయోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ)లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ దక్ష-2023 కార్యక్రమానికి గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యువత తమ మేధస్సు ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలన్నారు. హైదరాబాద్ డీఎంఆర్‌ఎల్ మాజీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, హెడ్ గ్లోబల్ డెలీవరీ-క్లౌడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ జనరల్ మేనేజర్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏయూ టెక్నో ఫెస్ట్‌లో మాట్లాడుతున్న కమిషనర్ నవీన్ మిట్టల్

కార్మికుల నిరసన



మురికి కాలువను శుభ్రం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మండలంలోని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అవుషాపూర్‌లో మురికి కాలువలు శుభ్రం చేసి గురువారం నిరసన చేపట్టారు. ప్రజల దగ్గర పన్నుల రూపంలో వసూలు చేసినా పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెక్కులు మాత్రం డ్రా కావడం లేదన్నారు.

పేద ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఘట్‌కేసర్: పేద ప్రజలకు మెరుగైన సేవలందించాలని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకును వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, జహంగీర్, నాయకులు కృప, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



ఐడీఎఫ్‌సీ బ్యాంకును ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి



మంచినీరు వృథా

మేడ్చల్ రూరల్: రాజబొల్లారం గ్రామ పరిధిలోని మోనార్క్ కంపెనీ సమీపంలో మేడ్చల్-శామీర్‌పేట్ రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపు నుండి నీరు వృథా అయింది. గంటల తరబడి నీరు వృథా అవుతున్న విషయాన్ని తెలుసుకున్న సిబ్బంది మరమ్మత్తులు చేసి నీటిని నియంత్రించారు.

'అలియాప్ వి హబ్' తో ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల అలియాప్ వి హబ్ తో ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ విభాగంలో అలియాప్ వి హబ్ తో ఎంఓయూ చేసుకుని అలియాప్ వి హబ్ ప్రెసిడెంట్ రమాదేవితో ఒప్పంద పత్రాలు మార్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి ఇద్దరు మృతి

- వేర్వేరుచోట్ల ప్రమాదాలు
- సంపులో పడి ఒకరు.. చెరువులో పడి మరొకరు

మేడ్చల్ రూరల్: వేర్వేరు చోట్ల జరిగిన రెండు సంఘటనల్లో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలు మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. ఒక ఘటనలో వలస కార్మికుడు సంపులో పడి మృతి చెందగా మరో ఘటనలో ఆటో డ్రైవర్ చెరువులో పడి మృతి చెందాడు. సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

- బీహార్‌కు చెందిన సంజీత్‌కుమార్ యాదవ్(29) బండమాదారం గ్రామంలో ఉన్న రాక్స్ అండ్ మినరల్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం హోలీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం కంపెనీలో ఉన్న సంపు వద్దకు బట్టలు ఉత్కుకోవడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడగా ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతి చెందాడు. తోటి కార్మికులు సంజీత్‌కుమార్ సంపులో పడి మృతి చెందినట్లు గుర్తించారు.
- మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీకి చెందిన రాజు(50) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గురువారం మేడ్చల్ పారిశ్రామిక చెక్ పోస్ట్ నుండి మేడ్చల్ పెద్ద చెరువు కట్టమీదుగా ఆటో నడుపుకుంటూ వచ్చాడు. ఆటో అదుపు తప్పి చెరువులో పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆటోను చెరువులో నుండి బయటకి తీసే లోపు డ్రైవర్ రాజు మృతి చెందాడు.